క్లుప్తంగా

ఆలూరు సీఐగా రవిశంకర్ రెడ్డి



ఆలూరు రూరల్: ఆలూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా రవిశంకర్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పనిచేస్తున్న వెంకట చలపతి అన్నమయ్య జిల్లా రాయచోటి మహిళా సర్కిల్ పోలీసు స్టేషన్‌కు బదిలీ అయ్యారు. నూతన సీఐ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో శాంతి భద్రతలపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఈ-కేవైసీ పూర్తి



పంట నమోదు జాబితాను పరిశీలిస్తున్న అధికారులు, రైతులు

మద్దికెర : మండలంలోని గ్రామాల్లో రబీ సీజన్‌లో సాగు చేసిన పంటల నమోదుకు సంబంధించి ఈ-కేవైసీ పూర్తి చేసినట్లు ఏఓ రవి తెలిపారు. గురువారం రైతు సేవా కేంద్రాల్లో 2024-25 సంవత్సరానికి సంబంధించి సామాజిక తనిఖీ కోసం ఈ- పంట నమోదు జాబితా రైతు సేవా కేంద్రాల వద్ద ప్రదర్శించారు. ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో 19,798 ఎకరాల్లో 4,907 మంది రైతులకు రెవెన్యూ శాఖ, వ్యవసాయశాఖ కలిసి పంటల నమోదు చేశారన్నారు. జాబితాను పరిశీలించి అభ్యంతరాలు వుంటే రాత పూర్వకంగా ఈనెల 21వ తేదీ లోపు రైతు సేవా కేంద్రాల్లో అందించాలని సూచించారు. వీఏఏలు జాకీర్‌హుస్సేన్, కవిత, ఇంద్రజ, ఆనంద్ పాల్గొన్నారు.

శేష వాహనంపై శ్రీవారు



శేషవాహనంపై దర్శనమిచ్చిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథుడు

మద్దికెర : పెరవలి గ్రామంలో కొలువుతీరిన శ్రీరంగనాథుడు, శ్రీదేవి, భూదేవి సతీసమేతుడై గురువారం శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చాడు. శ్రీరంగనాథుడి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శేషోత్సవం వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామి వారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. ప్రధాన అర్చకులు రంగస్వామి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శేష వాహనంపై గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.

వేషధారణల్లో అలరించిన భక్తులు



వివిధ వేషాల్లో గ్రామంలో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టిగ్రామంలో కామప్ప, కామమ్మ పండగ సందర్భంగా గురువారం భక్తులు వివిధ వేషధారణల్లో మొక్కులు చెల్లించుకున్నారు. తప్పెట్లు, మేళతాళాల నడుమ గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. హోలీ పండగ సందర్భంగా ముందస్తుగా వేషాలు వేసి ఆలయాల్లో పూజలు చేస్తారని గ్రామస్తులు తెలిపారు.

ముగిసిన మూగితాత ఉరుసు



స్వామివారి అశ్వాన్ని ఊరేగిస్తున్న భక్తులు

దేవనకొండ: మండలకేంద్రమైన దేవనకొండలో వెలిసిన దిగంబర దివానే మూగితాత ఉరుసు గురువారం జిరాయత్ కార్యక్రమంతో ముగిసింది. ముగింపు రోజున భక్తులు పెద్ద సంఖ్యలో దర్గాకు చేరుకుని ఫాతెహాలు సమర్పించారు. స్వామివారికి అశ్వానికి పూజలు చేసి భక్తులు మొక్కులు చెల్లించారు. భక్తులకు మంచినీరు, అన్నదాన సదుపాయాన్ని కల్పించినట్లు గ్రామపెద్దలు, దర్గా నిర్వాహకులు తెలిపారు.

దర్గాల్లో ప్రత్యేక ఫాతెహాలు

హొళగుంద: ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గాలను గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకుని ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. దర్గాలో మొక్కులు చెల్లించుకోవడానికి దూర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే హొళగుంద సాయిబన్న, చిణిగి తాతా దర్గాలు, షిర్డిసాయిబాబా ఆలయాలను భక్తులు దర్శించుకున్నారు.

ఉచిత టైలరింగ్ శిక్షణ

వెల్దుర్తి: ఉచిత టైలరింగ్ శిక్షణకు ఈనెల 22వ తేదీ లోపు సమీప సచివాలయాలు, ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ సుహాసిని గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, క్షత్రియ, వైశ్య, బ్రాహ్మణ, కాపు, బలిజ కులాల 18 నుంచి 50 ఏళ్లలోపు మహిళలు అర్హులన్నారు. శిక్షణ కాలంలో 75శాతం హాజరు ఉంటే ఆయా మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్ సైతం అందజేస్తామని పేర్కొన్నారు.

ఆర్భాటం సరే.. ఆచరణ ఏదీ?



చిట్యాల నుంచి పెద్దొడ్డికి వెళ్లే రహదారిలో చెత్త నిల్వ



చుంచుఎర్రగుడిలో పిల్లర్లకే పరిమితమైన సంపద కేంద్రం

- ప్రకటనలకే స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర
- గ్రామాల్లో ఎక్కడిక్కడే చెత్త నిల్వలు
- దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్న చెత్త సంపద కేంద్రాలు

కృష్ణగిరి: స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర అంటూ ఆర్భాటంగా ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించే అధికారులు, సిబ్బంది.. ఆచరణలో మాత్రం ఘోరంగా విఫలమవుతున్నారు. ఇటీవల ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో ఆర్భాటంగా ర్యాలీలు చేపట్టినా.. ఆచరణలో అందుకు విరుద్ధంగా ఉంది. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రధాన రహదారులపై చెత్త నిల్వలు రోజు రోజుకు పెరిగిపోయి కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. ఒక ప్రక్క ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమాల ద్వారా చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని సూచిస్తుంటే క్షేత్రస్థాయిలో అటువంటి చర్యలు కనిపించడం లేదు. కనీసం కాలువల్లో మురుగుతీసే పరిస్థితి కూడా లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. దీంతో రాత్రిళ్లు దోమల బెడద తీవ్రంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిరుపయోగంగా.. కేంద్రాలు..

గ్రామాల్లో చెత్తను సేకరించి చెత్త నుంచి సంపద కేంద్రాలకు తరలించి అక్కడ వర్మీ కంపోస్టు తయారు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కానీ ఇక్కడ అవేమీ జరగడంలేదు. మండలంలోని 16 గ్రామ పంచాయతీలకు గాను ఒకటి, రెండు తప్పా మిగతా వాటిని వినియోగంలోకి తీసుకరావడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. సంపద కేంద్రాలు వినియోగంలోకి రాకపోవడంతో చెత్తను రహదారులపై వేస్తున్నారు. దీంతో గ్రామాల్లో చెత్త పేరుకపోయి వ్యాధులు విజృంభిస్తున్నాయి. మరో పక్క రోడ్ల వెంట పేరుక పోయిన చెత్తను ఆవులు, గేదెలు తిని రోగాల బారిన పడుతున్నాయి. ఇప్పటికైనా చెత్త సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చి చెత్తను తరలించి సంపద కేంద్రాల్లో వేసేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న ఈఈ బి.హరి

ఆలూరు: విద్యుత్ శాఖ సిబ్బంది గృహ వినియోగదారులు, రైతులను వేధించడం, అవినీతి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆదోని డివిజన్ విద్యుత్ శాఖ ఈఈ బి.హరి హెచ్చరించారు. స్థానిక ఏడీఈ కార్యాలయంలో గురువారం ఆలూరు ఏఈ గుర్రప్ప ఆధ్వర్యంలో ఆలూరు విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని ఏఈ, ఎల్ఐ,జేఎల్ఎం, పోల్,టూపోల్ సిబ్బందితో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ఈనెల 1 నుంచి జూలై చివరి వరకు గృహ వినియోగదారులకు ఒక కిలోవాట్స్ కంటే అదనంగా విద్యుత్‌ను వాడేవారి కోసం ప్రత్యేకంగా ఏపీఎస్పీడీసీఎల్ శాఖ రాయితీ ఇస్తుందని, సద్వినియోగం చేసుకోవడానికి వెబ్ సైట్‌ను ప్రారంభించిందన్నారు. ఈ అవకాశాన్ని ఆదోని,పత్తికొండ, ఆలూరు సబ్ డివిజన్ పరిధిలోనున్న 2 లక్షలకు పైగా గృహ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఫోన్‌పే ద్వారా నగదును విద్యుత్ శాఖకు చెల్లిస్తేనే అదనపు విద్యుత్‌ను వాడుకునే వెసులుబాటుకు అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. ప్రతి నెలలో గృహవినియోగదారుల నుంచి రూ.11 కోట్ల వరకు విద్యుత్ బిల్లులను పెండింగ్‌లో ఉంచకుండా ఏఈలు చొరవతీసుకోవాలని చెప్పారు.

నాటుసారా రహిత సమాజాన్ని స్థాపిద్దాం



అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ విశ్వేశ్వరరావు

దేవనకొండ: నాటుసారా రహిత సమాజాన్ని స్థాపిద్దామని పత్తికొండ ఎక్సైజ్ సీఐ విశ్వేశ్వరరావు అన్నారు. గురువారం రాత్రి నవోదయం-2 కార్యక్రమంలో భాగంగా మండలంలోని పి.కోటకొండలో గ్రామ సభ నిర్వహించారు. గ్రామ ప్రజలతో సీఐ మాట్లాడుతూ నాటుసారా అక్రమ సారాను ప్రోత్సహించకుండా అరికట్టేందుకు ప్రతిఒక్కరూ సహకారం అందించాలన్నారు. నాటుసారా తయారు చేసినా, అమ్మినా అలాంటి వారిపై కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని హెచ్చరించారు. నాటుసారా తయారీకి, అమ్మకానికి పాల్పడే వారి వివరాలను తమకు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

ఎల్లార్తి దర్గాల నిర్వహణ టెండర్ ఖరారు

- డబ్బులు చెల్లించని మొదటి బిడ్డర్
- రెండవ బిడ్డర్‌కు అవకాశం కల్పించిన వక్ఫ్‌బోర్డు అధికారులు

హొళగుంద: ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గాల నిర్వహణ టెండర్ ఎల్లార్తికి చెందిన రెండవ బిడ్డర్ షాఫీర్‌బాషా అనే వ్యక్తికి ఖరారు అయినట్లు వక్ఫ్‌బోర్డు అధికారులు గురువారం విలేకరులకు తెలిపారు. గత నెల 27న విజయవాడ స్టేట్ వక్ఫ్‌బోర్డు కార్యాలయంలో 11 నెలల 15 రోజుల వరకు రెండు దర్గాలు, 38 రూములు, చందా పట్టి, చర్మ సేకరణ, చక్కెర, హేర్ కటింగ్ తదితర వాటి నిర్వహణకు గాను జరిగిన షీల్డ్ టెండర్‌లో రూ.1.75 కోట్లకు ఎల్లార్తి గ్రామానికి చెందిన బోయ మల్లికార్జున టెండర్ దక్కించుకున్నాడు. అయితే మొదటి బిడ్డర్ అయిన మల్లికార్జున తాను వేసిన బిడ్ డబ్బులు గడువులోగా చెల్లించకపోవడంతో రెండవ బిడ్డర్ అయిన షాఫీర్ బాషా వేసిన రూ.90 లక్షల మొత్తానికి టెండర్ ఖరారు చేసినట్లు అధికారులు తెలిపారు.

ఈ షీల్డ్ టెండర్‌లో ఇద్దరు మాత్రమే పోటీ పడటంతో రెండవ బిడ్డర్‌కు టెండర్ దక్కింది. వక్ఫ్‌బోర్డు అధికారులు నిర్వహణ గడువును తెలిపి తమకు దర్గాలను స్వాధీనం చేసిన తర్వాత నిర్వహణ బాధ్యతను తీసుకుంటామని షాఫీర్ బాషా తెలిపాడు.

బింగిదొడ్డిలో ఘర్షణ - ఇరువర్గాలపై కేసు

వెల్దుర్తి: మండలంలోని బింగిదొడ్డి గ్రామంలో బుధవారం జగన్‌మోహన్ రెడ్డి, ఆయన ఇంటి పక్కపేన్న శంకర్ రెడ్డి మధ్య ఉన్న వైరం ఘర్షణకు దారి తీసింది. జగన్‌మోహన్ రెడ్డి ఇంటి ముందు ఆపిన కారు వల్ల తమ ఇంటికి వెళ్లేందుకు దారి లేదంటూ శంకర్ రెడ్డి కుమారుడు, ఆర్మీ జవాన్ ప్రభాకర్ రెడ్డి వీరంగం సృష్టించాడు. జగన్‌మోహన్ రెడ్డి, ఆయన భార్య, సర్పంచ్ అయిన వెంకటేశ్వరమ్మ తదితరులపై దాడికి పూనుకున్నాడు. వైరి వర్గం అడ్డుకుంటూ దాడులకు దిగారు. దీంతో సర్పంచ్ తనయుడు సుధాకర్ రెడ్డి ఫిర్యాదు మేరకు ప్రభాకర్ రెడ్డి మరో ముగ్గురిపై, ప్రభాకర్ రెడ్డి ఫిర్యాదు మేరకు సర్పంచ్, మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అశోక్ గురువారం తెలిపారు.



పెద్దహోతూరులో భక్తుల నడుమ రథోత్సవం జరుగుతున్న దృశ్యం

రమణీయం.. రథోత్సవం

ఆలూరు రూరల్: మండలంలోని పెద్దహోతూరు గ్రామంలో కొలువైన ఉచ్చీరప్ప, మరకట్టు గ్రామంలోని సలువప్ప తాతల రథోత్సవం గురువారం రమణీయంగా సాగింది. రథోత్సవాన్ని తిలకించేందుకు ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ నియోజకవర్గాల ప్రజలతో పాటు కర్ణాటక,తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తుల పెద్ద ఎత్తున తరలి వచ్చి.. రథోత్సంపై ఉన్న కలశానికి ఫలాలను విసిరి మొక్కులు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా పెద్దహోతూరు గ్రామం జనసంద్రంగా మారింది. మరకట్టు గ్రామంలో కొలువైన సలువప్పతాత ఉత్సవ విగ్రహాన్ని అర్చకులు ఉదయం గ్రామస్తుల నడుమ వేద మంత్రోచ్చారణలతో పెద్దహోతూరు గ్రామానికి చేర్చారు. సాయంత్రం ఉచ్చీరప్ప, సలువప్ప ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేసి రథంపై అధిష్టింపజేశారు. సాయంత్రం వేలాదిమంది భక్తులు నడుమ ఎదరు బసవన్న విగ్రహం వరకు రథాన్ని లాగారు. అంతకు ముందు ఆలయ అర్చకులు చంద్రమౌళి ఆధ్వర్యంలో స్వామికి కుంకుమార్చన, జలాభిషేకం, మహామంగళ హారతి, గంగ పూజ వంటి తదతర పూజలు చేపట్టారు. ఉత్సవం సందర్భంగా గ్రామానికి వచ్చే భక్తుల కోసం ఉచితంగా ఆటోల ద్వారా రవాణా సౌకర్యం కల్పించారు. రథోత్సవానికి తిలకించేందుకు వెళ్లే భక్తుల కోసం ఆలూరు పట్టణంలోని జూనియర్ కళాశాల సమీపంలో ఉచితంగా మజ్జిగ, మంచి నీళ్ల పంపిణీ చేశారు. ఆలూరు ఎస్ఐ దిలీప్ కుమార్ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

తురువగల్లులో గ్రామ దేవర

ఆస్పరి: మండలంలోని తంగరడోణ మజరా గ్రామమైన తురువగల్లులో ఈనెల 19వ తేదీన సుంకులమ్మవ్వ దేవర నిర్వహించనున్నట్లు గ్రామస్తులు గురువారం తెలిపారు. ఆలయంలో సుంకులమ్మవ్వకు ప్రత్యేక పూజలు, కుంభాల ఊరేగింపు నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మద్దికెర : స్థానిక ఆదర్శ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఆసక్తి గల విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సవిత గురువారం తెలిపారు. పది పూర్తయిన విద్యార్థులు ఈనెల 17 నుంచి మే 22వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 ఆన్‌లైన్‌లో చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు టమాట ప్రాసెసింగ్ యూనిట్‌కు భూమిపూజ

పత్తికొండ రూరల్ : మండలంలోని కోతిరాళ్ల గ్రామ పంచాయతీ పరిధిలో సుమారు రూ.11 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న టమాట ప్రాసెసింగ్ యూనిట్‌కు శుక్రవారం భూమి పూజ చేయనున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో హోసూరు సమీపంలో నిర్మించ తలపెట్టిన టమాటా ప్రాసెసింగ్ యూనిట్‌కు స్థలం అనువైనది కాదని కనకదిన్నె సమీపంలో యూనిట్ ఏర్పాటుకు నిర్ణయించారు. భారీ పరిశ్రమల శాఖ మంత్రి టిజి.భరత్, ఎమ్మెల్యే కేఈ శ్యాంకుమార్‌ల చేతుల మీదుగా జరిగే కార్యక్రమానికి అధికారులు గురువారం ఏర్పాట్లు పూర్తి చేశారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

హొళగుంద: మండలంలోని నెరణికి గ్రామంలో జెడ్పీ వైస్ చైర్మన్ కురువ బుజ్జమ్మ సహకారంతో రూ.5 లక్షల జెడ్పీ నిధులతో గురువారం సీసీ రోడ్డు, డ్రైన్ల నిర్మాణం పనులను ప్రారంభించారు. సర్పంచ్ వన్నూరమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు కోగిలతోట శేషప్ప, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్కే గిరి, నాయకులు సోమప్ప, దర్గప్ప, సవారప్ప, బజ్జప్ప తదితరులు పనులకు భూమి పూజ చేశారు.

15నుంచి ఒంటి పూట బడులు

తుగ్గలి : మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ఈనెల 15వ తేదీ నుంచి ఒంటిపూట తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో-2 రామవెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. పాఠశాలల్లో ఒంటి పూట తరగతులు పక్కాగా అమలు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి నుంచి ఉత్తర్వులు అందాయన్నారు. ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఒంటిపూట తరగతులు నిర్వహిస్తామన్నారు. ఈనెల 17వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో పరీక్షా కేంద్రాలున్న పాఠశాలల్లో మధ్యాహ్నం 1.15 నుంచి సాయంత్రం 5గంటల వరకు తరగతులు నిర్వహించాలని సూచించారు. ఎండ తీవ్రత దృష్ట్యా గ్రామ పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ సహకారంతో పాఠశాలల్లో తాగునీరు వసతి కల్పించాలన్నారు. అలాగే వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు.

ఇళ్ల లబ్ధిదారులకు అదనపు సాయం

మద్దికెర : గత ప్రభుత్వంలో ఇళ్లు మంజూరై వివిధ దశల్లో నిర్మాణాలు నిలిచిపోయిన లబ్ధిదారులకు అదనపు సాయం కింద రూ.50 వేలు అందిస్తామని హౌసింగ్ ఏఈ ఉమాకాంత్ తెలిపారు. గురువారం మండల కేంద్రమైన మద్దికెరలో మధ్యలో ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. నిర్మాణ దశలు బట్టి బిల్లు మంజూరు చేశామన్నారు. ఎస్సీ, బీసీలకు గతంలో ఇస్తున్న బిల్లు రూ.1.80 లక్షలకు మరో రూ.50 వేలు అదనంగా ఇస్తామన్నారు. అలాగే ఎస్టీలకు రూ.1.80 లక్షలతో పాటు అదనంగా మరో రూ.75 వేలు అందజేస్తామని పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులు కుల ధ్రువ పత్రం అందజేయాలని చెప్పారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ- కేవైసీ చేయించుకోవాలి

వెల్దుర్తి: రైస్ కార్డు కలిగిన వారందరూ ఈ- కేవైసీ పూర్తి చేసుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ గురువారం తెలిపారు. అలా కాని పక్షంలో వచ్చే నెల నుంచి రేషన్ అందే అవకాశం ఉండదన్నారు. ఈ కేవైసీ పెండింగ్ ఉన్న వారు వెంటనే డీలర్, వీఆర్ఓలను సంప్రదించి పూర్తి చేయించుకోవాలన్నారు.

అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు

- రూ.8.68 కోట్లతో పనులు, వేతనాలు
- రూ.1.28 లక్షల జరిమానా, రూ.54 వేల రికవరీ



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

మద్దికెర : వ్యవసాయ కూలీలు వలసలు పోకుండా కల్పిస్తున్న ఉపాధి పనుల్లో ఎవరైనా అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏపీడీ మాధవీలత హెచ్చరించారు. గురువారం స్థానిక ఉపాధి కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ పథకం 18వ సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమంలో పాల్గొని విచారణ చేశారు. ఆమె మాట్లాడుతూ 2023-24 సంవత్సరానికి మండలంలోని గ్రామాల్లో రూ.8.68 కోట్ల పనులు, కూలీలకు వేతనాలు ఇచ్చామన్నారు. ఆయా శాఖల అధికారులు పనులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు రూ. 1.28 లక్షలు జరిమానా విధించామని చెప్పారు. అంతేగాక ఉపాధి సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించనందుకు రూ. 54 వేలు తిరిగి ప్రభుత్వానికి చెల్లించాలని ఆదేశించామని తెలిపారు. ఈఏడాది వ్యవసాయ పనులు ముగిసాయని, అడిగిన ప్రతి ఒక్కరికి పనులు కల్పించాలని, నిర్లక్ష్యం చేస్తే సిబ్బందిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఏపీడీ పక్కీరప్ప, ఎంపీడీఓ కొండయ్య, ఏపీఓలు నర్సిరెడ్డి, రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల కమిటీ ఏర్పాటు

ఆలూరు: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాలకు పార్టీ కమిటీలను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి గురువారం ఆదేశాలు వెలువడ్డాయి. ఈ మేరకు.. ఆలూరు మండలం ఉపాధ్యక్షుడిగ వీరేష్, నెట్టప్ప, ప్రధానకార్యదర్శులుగా నాగప్ప, జనార్దన్, ప్రవీణ్‌రెడ్డి, మోహిద్దీన్, కార్యదర్శులుగా శర్మస్‌ఖాన్, వెంకటేష్, మల్లికార్జున, శివమణి,రాజశేఖర్‌రెడ్డి, కోశాధికారిగా ఎల్లప్పను నియమించారు.

హొళగుంద మండలం ఉపాధ్యక్షులుగా హుసేని,లక్ష్మన్న, ప్రధానకార్యదర్శులుగా షేషగిరి, భాస్కర్‌రెడ్డి, మల్లికార్జున,పక్కీరప్ప, కార్యదర్శులుగా చంద్ర, ఈశ్వర్‌రెడ్డి, షేక్షావలి,ఎల్లప్ప, అంజినయ్య, కోశాధికారిగా దస్తగిరిని ప్రకటించారు.

హాలహర్వి మండలం ఉపాధ్యక్షులుగా హుసేని,మల్లికార్జున, ప్రధానకార్యదర్శులుగా చిన్నబసప్ప, నారాయణ, సురేంద్రనాథ్‌గౌడ్, భాస్కర్, కార్యదర్శులుగా గోపాల్, అర్జున, శివరాజ్‌గౌడు,రమేష్, వన్నూరు, కోశాధికారిగా లింగప్పని నియమించారు.

ఆస్పరి మండల ఉపాధ్యక్షులుగా రామకృష్ణ, మునిస్వామి, ప్రధాన కార్యదర్శులుగా రంగస్వామి, రాజన్న, హనుమంతరెడ్డి,కృష్ణ, కార్యదర్శులుగా చాంద్‌భాషా, చిన్నాయప్ప ,హుసేని, అంజినయ్య,వెంకటేష, కోశాధికారిగా శ్రీరాములును ప్రకటించారు.

చిప్పగిరి మండలం ఉపాధ్యక్షులుగా కొండా సోముశేఖర్, సత్యరెడ్డి, ప్రధానకార్యదర్శులుగా గాటింటి నాగేంద్ర,గిరి, జయన్న, చెరువు తిమ్మప్ప, కార్యదర్శులుగా నారాయణస్వామి, లోకన్న,హనుమంతు, లింగన్న,రమేష్, దేవేంద్రకుమార్, సూరి, కోశాధికారిగా ఎట్టం రంజిత్‌ను నియమిస్తూ ఆదేశాలు వెలువరించారు.

దేవనకొండ మండలం ఉపాధ్యక్షులుగా జయరాం, ఆనందు, ప్రధాన కార్యదర్శులుగా తిరుమలేష్,చంద్రన్న,జలందర్,దస్తగిరి, కార్యదర్శులుగా విరూపాక్షి, రుద్రగౌడు,మల్లేశ్వరరెడ్డి,కృష్ణా, ఏరూరు రంగన్న, కోశాధికారిగా కామేశ్వరరెడ్డిని నియమించారు.

- **తుగ్గలి** : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ మండల కమిటీని ఏర్పాటు చేశారు. ఇది వరకే మండల పార్టీ అధ్యక్షుడిగా అట్ల గోపాల్‌రెడ్డి నియమితులయ్యారు. ఇప్పుడు ఉపాధ్యక్షులుగా నారాయణ, సురేష్, ప్రధాన కార్యదర్శులుగా విష్ణువర్ధనరెడ్డి, వెంకటేష్ నాయక్, రవి, రంజాన్ వలి, కార్యదర్శులుగా సత్యనారాయణ, గిడ్డయ్య, శ్రీనివాసరెడ్డి, మద్దిలేటి, శేఖర్, ట్రెజరర్‌గా కృష్ణానాయను నియమించారు.

- **పత్తికొండ రూరల్** : పత్తికొండ మండల ఉపాధ్యక్షులుగా కె.అంజినయ్య, జి.నరసింహుడు, జనరల్ సెక్రెటరీలుగా కె.నాగిరెడ్డి, కె.లింగప్ప, పి.మస్తానప్ప, కె.హుసేన్, కార్యదర్శులుగా హెచ్.నారాయణస్వామి, కె.ర మణ, ఎం.వెంకటరెడ్డి, బి.జి.నాగరాజు, బి.ఎర్రన్న, కోశాధికారిగా ఎస్.రమేష్‌నాయక్‌ను ప్రకటించారు.

- **కృష్ణగిరి**: మండల ఉపాధ్యక్షులుగా బాలమిన్నెల్ల, జనార్ధన్, జనరల్ సెక్రటరీలుగా కృష్ణారెడ్డి, నవీనపాటి, సురేష్, హెచ్. సుధాకర్, సెక్రటరీలుగా వై. రామచంద్రుడు, ప్రహ్లాద, దేవరాజు, చిన్న శాలుమీషా, నాగరాజు, ట్రెజరర్‌గా తిమ్మరాజును ఎంపిక చేసినట్లు పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

- **వెల్దుర్తి**: పార్టీ మండల అధ్యక్షుడిగా బొమ్మన రవిరెడ్డి నియమించబడగా నూతనంగా ఉపాధ్యక్షులుగా కె రాధాకృష్ణారెడ్డి, జి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శులుగా ఎస్.సురేంద్రనాథ్ రెడ్డి, ఎ. శ్రీనివాసులు, డి. కేశవులు, ఎం. రవిశంకర్, కార్యదర్శులుగా సి. మదనగోపాల్, కె. నారాయణ, కె. నాగిరెడ్డి, కె. ప్రభాకర్ నాయుడు, జె. సిద్ధార్థ, కోశాధికారిగా బి. ప్రేమ్ చరణ్ ఉన్నారు.

- **మద్దికెర** : మండల ఉపాధ్యక్షుడుగా తిమ్మినేని కృష్ణ, జనరల్ సెక్రటరీలుగా శంకరయ్య, రామకృష్ణ, నాగేష్, చౌడప్ప సెక్రటరీలుగా నాయుడు, షేక్షావలి, కృష్ణ, అనిమిరెడ్డి, రామాంజనేయులు, కోశాధికారిగా అబ్దుల్‌గఫూర్‌ను ప్రకటించారు.

వలస కూలీ మృతి



బురుజు రంగప్ప(ఫైల్)

తుగ్గలి : గుండె పోటుతో ఓ వలస కూలీ మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల సమాచారం మేరకు.. తుగ్గలికి చెందిన బురుజుల రంగప్ప (53) ఉన్న ఐదెకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించే వారు. వ్యవసాయ పనులు పూర్తి కావడంతో నెల క్రితం భార్య సుజాతతో కలిసి పొగాకు పంట తెంచేందుకు బాపట్ల జిల్లా పూసపాడు గ్రామానికి వలస వెళ్లారు. ఈ క్రమంలో గురువారం ఉదయం పనికి వెళ్లేందుకు సమాయాత్తమవుతుండగా ఛాతీలో నొప్పి రావడంతో ఒక్కసారిగా కుప్పకూలి అక్కడిక్కడే మృతి చెందాడు. కుటుంబ పోషణ, వ్యవసాయానికి చేసిన అప్పులు తీర్చేందుకు వలస వెళ్లినట్లు కుటుంబ సభ్యులు చెప్పారు.

ఆక్రమణలను తొలగించండి

ఆదోనిఅర్బన్: ఆర్టీసీ బస్సులు తిరిగే ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా ముందుకు వచ్చి ఏర్పాటు చేసుకున్న షాపులను తొలగించాలని డీఎస్పీ హేమలత ఆదేశించారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ నుంచి సెయింట్ జోసెఫ్ స్కూల్, శ్మశానవాటిక, తిక్కస్వామి దర్గా ప్రాంతాల్లోని రహదారులను డీఎస్పీ పరిశీలించారు. ఆ రహదారుల్లో బస్సులు వెళ్లేందుకు అడ్డుగా ఉన్న షాపుల యజమానులకు హెచ్చరికలు జారీ చేశారు. రోడ్డు ప్రమాదాల కట్టడికి పోలీసుశాఖ కట్టుబడి ఉందన్నారు. టౌన్ ప్లానింగ్ అధికారుల ఆధ్వర్యంలో అక్రమంగా ఏర్పాటు చేసుకున్న షాపుల తొలగింపు పనులు ఐదో రోజు గురువారం చేపట్టారు. పట్టణంలోని శ్రీనివాసభవన్ నుంచి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వరకు ఇరువైపులా రోడ్డును ఆక్రమించుకుని ఉన్న షాపులను తొలగించారు.

నివాళి

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు డి.ఈరన్న(75) గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బుసినే శ్రీరాములు గ్రామానికి చేరుకుని మృతదేహం పూలమాల ఉంచి నివాళులర్పించారు. ఎంపీటీసీ గోపాల్, నాయకులు పరశురాం, జయరాం, గంగాధర్ పాల్గొన్నారు.

పీ.కొత్తూరులో నీటి ఎద్దడి

తుగ్గలి : మండల పరిధిలోని పీ.కొత్తూరులో నాలుగు రోజులుగా తాగునీరు సరఫరా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బొల్లవానిపల్లి వద్దనున్న బోరు ద్వారా రోజూ నీటిని సరఫరా చేసేవారు. అయితే బోరుపై వివాదం కారణంగా సరఫరా ఆగిపోయింది. దీంతో తాగునీటి కోసం గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. ఊరి శివారులో ఉన్న చేతి పంపుల నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. అధికారులు స్పందించి తాగునీరు సరఫరా అయ్యేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ మండల ఏఈ నరేష్‌ను సంప్రదించగా శుక్రవారం నుంచి తాగునీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

జయప్రదం చేయండి

ఆలూరు రూరల్: రజకులకు రక్షణ చట్టం అమలు చేయాలని కోరుతూ ఈ నెల 22వ తేదిన కోడుమూరులో నిర్వహించే రజక సంఘం జిల్లా మహా సభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు ముక్కన్న కోరారు. స్థానిక మంగళ ఆంజనేయ స్వామి దేవాలయ ఆవరణలో గురువారం సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు పూర్తవుతున్నా నేటికీ రజకుల స్థితిగతులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయన్నారు. కూటమి నాయకులు ఎన్నికల ముందు రజకులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి గురుశేఖర్ కమిటీ సభ్యులు ఈరన్న, నాగరాజు, ఈశ్వర్, సిద్దప్ప, అంజి,సుధాకర్ ఉన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టించాలి



మాట్లాడుతున్న ఆదోని డీఎల్‌పీఓ నూర్జహాన్

హొళగుంద: గ్రామ పంచాయతీలకు ఆదాయ వనరులు సమకూర్చేందుకు చెత్త నుంచి సంపదను సృష్టించడానికి చర్యలు తీసుకోవాలని డీఎల్‌పీఓ నూర్జహాన్ అన్నారు. గురువారం హొళగుంద సమీపంలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్‌లో హొళగుంద సర్పంచ్ చలవాది రంగమ్మ, పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో హొళగుంద, హాలహర్వి మండలాల పంచాయతీ సెక్రటరీలు, గ్రీన్ అంబాసిడర్లు, పారిశుద్ధ్య కార్మికులకు ఎస్‌డబ్ల్యూపీసీ నిర్వహణ పై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీఎల్‌పీడీఓ మాట్లాడుతూ గ్రామంలో సేకరించిన తడి, పొడి చెత్తను వర్మీ కంపోస్ట్‌గా తయారు చేసి విక్రయించడం ద్వారా పంచాయతీ ఆదాయం పెంచడంతో పాటు గ్రామాలలో పారిశుద్ధ్యం మెరుగు పడేలా చేయవచ్చన్నారు. వ్యవసాయంలో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించడానికి తమవంతు కృషి చేయలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీలు చక్రవర్తి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.